# కామ్రేడ్ భీమవరపు గురవారెడ్డికి విప్లవజోహార్లు



**తరిమెల** నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు కోశాధికారి, కామ్రేడ్ భీమవరపు గురవారెడ్డి (69 సం॥) 2016 నవబంబర్ 3న గుండెపోటుకు గురై హఠాత్తుగా మరణించారు. కామ్రేడ్ గురవారెడ్డికి సిపిఐ(ఎం॥ఎల్) విప్లవ నివాళులర్పిస్తోంది. ఆయన భార్య, కుమారుడు, కుమార్తెలకు, ఇతర కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తోంది.

1948లో ఓ మధ్యతరగతి రైతు కుటుంబంలో కా॥గురవారెడ్డి జన్మించారు. కృష్ణాజిల్లాలో ఆయన పుట్టి పెరిగిన ప్రొద్దుటూరు గ్రామాన్ని ముంచెత్తిన కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంతో కా॥ గురవారెడ్డి స్ఫూర్తి పొందారు. కా॥ గురవారెడ్డి తండ్రి కా॥ వెంకటరెడ్డి ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ సభ్యునిగా వుండేవారు. కా॥ గురవారెడ్డి విద్యార్థిగానున్న కాలంలోనే స్టూడెంట్ ఫెడరేషన్ కార్యక్రమాల్లో చురుగ్గా వుండేవారు. తదనంతరం ఆయన కమ్యూనిస్టు విప్లవకారుల పక్షాన నిలిచారు. తన చివరిశ్వాస వరకు ఆయన దృఢంగా విప్లవ రాజకీయాలను కలిగివుండి, విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలకు మద్దతుగా నిలిచారు.

ఎన్నికల ప్రక్రియ అవినీతిమయమైపోయిన కాలంలో, ఒక్క రూపాయి కూడా వెచ్చించి ఓటర్లను ప్రలోభపెట్టకుండా ఆయన ప్రొద్దుటూరు గ్రామసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సర్పంచ్‌గా తన పదవీకాలంలో పంచాయితీల హక్కుల పునరుద్ధరణకొరకు ఆయన పోరాడారు. ఆ క్రమంలో ఆంధ్రప్రదేశ్ స్థాయిలో సర్పంచులందరినీ రాష్ట్రస్థాయి నిర్మాణంలో సంఘటితపరిచారు. ఆయన ఆ నిర్మాణానికి కార్యదర్శిగా పనిచేశారు. చట్టప్రకారం పంచాయితీలకు రావలసిన కొన్ని హక్కులను ఆయన నాయకత్వంలో సాధించు కున్నారు. రెండవసారి పోటీచేయటానికి ఆయన నిరాకరించి మరొకరిని పోటీచేయవలసిందిగా కోరారు.

ఆ తర్వాతనుండి ఆయన తన కాలం మొత్తాన్ని తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టుకు కేటాయించారు. ట్రస్టు చేపట్టిన ఏ కార్యక్రమాన్నైనా-అది నిధుల సేకరణగావచ్చు, సెమినార్ల నిర్వహణకావచ్చు, పుస్తక ప్రచురణలుకావచ్చు-విజయవంతం చేసేందుకు ఆయన అవిశ్రాంతంగా కృషిచేశారు. తరిమెల నాగిరెడ్డి ప్రసిద్ధ కోర్టు ప్రకటన 'తాకట్టులో భారతదేశా'న్ని మేధావుల వద్దకు, వివిధ ప్రజాతంత్రవాదులవద్దకు, వివిధ రాజకీయ అభిప్రాయాలుగల వారి నడుమకు తీసుకెళ్ళటంలో తన శక్తులన్నింటినీ వెచ్చించారు. తద్వారా విప్లవ రాజకీయాలను వివిధ సెక్షన్ల ప్రజలమధ్యకు విస్తృతంగా తీసుకెళ్ళారు.

కా॥గురవారెడ్డి వినమ్రంగా వుంటూ, వివిధ రాజకీయ విభాగాలవారితో ఓపికగా వ్యవహరిస్తూ కృషిసాగించేవారు. తన గ్రామంలోని పరిసరప్రాంతాలలోని ప్రజల ప్రతి డిమాండుకు - వ్యవసాయ సంక్షోభం, చెరకు రైతుల గిట్టుబాటు ధరల సమస్య, పోలీసు అత్యాచారాలు, దళితులపై దాడులువంటి సమస్యలన్నింటికీ కా॥గురవారెడ్డి ప్రతిస్పందించారు. జిల్లాలో పాలక సెక్షన్లు గ్రామంలో పేదలను విభజించేందుకు చేసిన వివిధ ప్రయత్నాలను వ్యతిరేకించి, ప్రజలమధ్య ఐక్యతను నెలకొల్పటంకోసం ఆయన తన శక్తిసామర్థ్యాలను వెచ్చించారు.

కా॥గురవారెడ్డి హఠాన్మరణం ప్రజాస్వామ్యవాదులను, విప్లవకారులను, ప్రగతిశీలశక్తులను దిగ్భ్రాంతులను చేసింది. విప్లవోద్యమం ఒక నిఖార్సైన మద్దతుదారును కోల్పోయింది.

సిపిఐ(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్‌కమిటి కా॥బి.గురవారెడ్డికి విప్లవ జోహార్లర్పిస్తోంది. యువ కామ్రేడ్స్‌ను ఉత్తేజపరిచేందుకు ఆయన జ్ఞాపకాలు తోడ్పడతాయి.

కా॥గురవారెడ్డికి విప్లవజోహార్లు.

**విజయవాడ**
**3-11-16**

**విశ్వం**
ప్రధాన కార్యదర్శి
**కేంద్రకమిటి, సిపిఐ(ఎం-ఎల్)**

****